



గీతాకేఫ్ దగ్గర నిల్చున్నాడు సుబ్బరాజు.

అతని చేతిలో సిగరెట్ సగంవరకు కాలివుంది. అతని చూపులు మెయిన్‌రోడ్డు మీదికి వున్నాయి. నలభై నిముషాల క్రితం సుబ్బరాజు అక్కడికి వచ్చాడు. నలభై నిముషాల్లో పది సిగరెట్లు కాల్చాడు.

ఓసారి చేతినున్న వాచీకేసి చూసుకున్నాడు. ఐదూ నలభై దాటుతోంది. చివరిదమ్ము పీల్చి సిగరెట్ పీకను వేలితో చిమ్మేశాడు.

ప్యాంట్‌జేబులో నించి సిగరెట్ పాకెట్ తీశాడు. కాని అందులో సిగరెట్లు లేవు. పక్కనేవున్న కిళ్ళీకొట్లో ఒక్కటి సిగరెట్ పాకెట్ కొన్నాడు. ఓ సిగరెట్ తీసి వెలిగించబోతుండగా గబగబా నడచివస్తున్న మాలతి కనిపించింది. ఎర్రచీరమీద ఎంబ్రాయిడరి పువ్వులు. అదేరంగు బ్లౌజు. చిరునవ్వు నవ్వాడు సుబ్బరాజు.

మాలతి నవ్వింది. కాని ఆ నవ్వులో సుబ్బరాజుకి విషాదం కనిపించింది. ఆమె ముఖం వాడిపోయి వుంది.

ఇద్దరూ గీతా కెఫ్ ఫామిలీరూములోకి నడిచారు. ఎదురెదురుగా కూర్చున్న ఓ నిముషం తర్వాత "సారీ ..లేటయింది" నొచ్చుకుంటున్నట్టు అన్నది మాలతి.

"ఫర్వాలేదు ... ఎందుకలా వున్నావ్ ?" అడిగాడు సుబ్బరాజు.

"ఈరోజు చాలా చెడ్డరోజు"

"ఏం...ఇప్పుడేమయింది ?"

"నీకో దుర్వార్త చెప్పబోతున్నాను"

"ఏమిటి ?"

"నా పెళ్ళి నిశ్చయమయింది" చిన్నగా చెప్పింది మాలతి. ఆమె ముఖం విచారంగా వుంది.

"నిజం!" నమ్మలేనట్లు అడిగాడు సుబ్బరాజు. అతని ముఖం నిండా ఆశ్చర్యం.

"సారీ.రాజా. ఈ వార్త నీ గుండెలను పగల గొడుతుందని నాకు తెలుసు. కాని ఏం చెయ్యను? ఇది నిజం.. నేను ఆడదాన్ని. అశక్తురాలిని.. మన పెళ్లి విషయం ఇంట్లో చెప్పాను. ఇంతెత్తున లేచారు. నిన్నుచేసుకుంటే అమ్మ నూతిలో దూకుతానన్నది. నాన్న, అన్నయ్య నీ అంతం చూస్తామని బెదిరించారు. వారిని ఎదిరించే ధైర్యం నాకులేదు క్షమించు రాజా.. నా పరిస్థితి అర్థంచేసుకో:. ప్లీజ్" దీనంగా ముఖం పెట్టి అన్నది మాలతి.

సుబ్బారాజు ఏదో మాట్లాడబోయేంతలో సర్వరు వచ్చాడు.

నీరసంగా "రెండూ బ్రూ కాఫీ" అన్నది మాలతి. సర్వరు వెళ్ళిపోయేడు. మాలతికి సుబ్బరాజు క్రుంగిపోతున్నట్టు కనిపించాడు.

ఐదు నిముషాల వరకు ఇద్దరూ మాట్లాడుకోలేదు.

తర్వాత సర్వరు కాఫీ కప్పులను టేబిల్ మీద పెట్టిన చప్పుడుతో ఈ లోకంలోకి వచ్చారు. చెరోకప్పు తీసుకున్నారు.

"నన్ను వదిలి మరెవర్నో చేసుకొని నువ్వు బతగ్గలవా?" అడిగాడు సుబ్బరాజు.

"ఏంచెయ్యను?...తప్పదు..నాకూ బాధగానే వుంది. ఎన్ని కలలు కన్నాము? మనిద్దరం ఏదో పాపం చేసి వుండాలి. అందుకే విడిపోతున్నాము. కనీసం వచ్చే జన్మలోనైనా."

ఆ తర్వాత మాలతి మాట్లాడలేదు.

# డాక్టరు సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

**బి. వి. -హుబ్లీ.**

నాకు నా మేనమామ కుమార్తెతో వివాహమయింది. ఆమెకు చిన్నతనములో 'పోలియో' వచ్చినది. మామూలుగా నడుస్తుంది. 'పోలియో' వంశపారంపర్యముగా వచ్చే వ్యాధా? ఆమె వంశములో ఎవరికీ లేదు. మాకు పుట్టబోయే పిల్లలకి ఈ వ్యాధి సంక్రమించే అవకాశమున్నదా?

"పోలియో" రోగం ఏ మాత్రం వంశపారంపర్యంగా వచ్చేది కాదని ఏ విధమైన అనుమానం లేకుండా చెప్పవచ్చును. ఈ విషయాన్ననుసరించి మీకు కలుగబోయే పిల్లలకి ఆ రోగం సంక్రమిస్తుందనే అనుమానానికి తావు లేదుగా!

కానీ ఒక్కమాట! చంటి పిల్లలలో ఈ రోగం రాగల అవకాశాలు ఎక్కువ కాబట్టి ఈ రోగకారక వైరస్‌లు పిల్లల శరీరములోకి ప్రవేశించి తద్వారా పోలియో రోగం ఏర్పడితే— అది వంశపారంపర్యంగా వచ్చిందనే అనుమానం కలగటం తప్పనీ, మామూలుగా ఈ రోగం కూడా వచ్చిందని అనుకోవాలి.

**వి. ఎస్. ఎల్. - విజయనగరం**

మా పెద్దబ్బాయికి 13 సం. లు ఆరోగ్యముగా వుంటాడు. కానీ కాళ్ళు ముడుచుకుని మఠం వేసుకొని కూర్చోలేడు. భోజనము చేసేటప్పుడు ముందుకు వంగినప్పుడు మోకాళ్ళు, నడుం నొప్పి అని బాధపడతాడు. పైకి వాపు లేదు.

కొందరికి కొన్ని కీళ్ళ నిర్మాణంలో పుట్టుకలోనే ఏర్పడే కొన్ని లోపాలవల్ల ఆ కీళ్ళు సాధారణంగా చేయగలిగే పని తనాలకన్నా తక్కువ పని తనం కలిగి ఉండటం ముఖ్యంగా ముడవటం, జాపటం [ఫ్లెక్షన్— ఎక్స్‌టెన్షన్] మొదలయిన మామూలుగా కూర్చోలేక పోవటం, నడవలేక పోవటం జరుగుతుంది. కీళ్ళలోపలి "లిగమెంట్స్" అనబడే కండలు పొట్టివైతే ఇలా జరుగవచ్చును.

ఇలా మాత్రమే గాకుండా, స్థూలకాయం గల వారికి, ఎక్కువగా నడక మొదలయిన వ్యాయామం చేయవలసిన అవసరం లేనివారికి ఇలా కీళ్ళ కదలికలలో అవరోధాలు ఏర్పడవచ్చును.

ఆ భాగాలను క్రమక్రమంగా వ్యాయామము చేయడం ద్వారా, అక్కడి కండరాలను సడలింప చేసినట్లయితే పరిస్థితిలో చాలా మటుకి మార్పు వస్తుంది. ప్రకృతి సిద్ధమైన శరీరోపయోగాలని సక్రమంగా వాడబడటానికే గాని, నిరుపయోగపరచటం ద్వారా దానిని అణగద్రొక్కితే ఇలా జరిగే అవకాశం ఎక్కువ.

**వై. ఆర్. బి. - కలకడ**

నాకు ఏడాది వయసప్పుడు తల్లో పుండులేచింది. తెల్లని చీము కారుతూ 5 నెలలు బాధ పెట్టింది. మందులవల్ల పుండు మానింది. ఎడమ చేయి భుజము వద్ద కీలు కొద్దిగా జారింది. చేయి చలనం లేకుండా పోయింది. ఇప్పుడు కొంచెము నయముగా వున్నది. నాలుగు నెలల క్రితం రెండు మార్లు తెలివి తప్పి పడిపోయాను. ఆ సమయములో ఒక ప్రక్క కాలూ, చెయ్యి లాగుతాయి.

మీకు ఉన్న రోగం— ప్రస్తుతానికి ఎపిలెప్సీ [అంటే అపస్మారం] గానీ, దానికి సంబంధించిన రోగాలు కాని కాదు. మీ తలలోని చీము కారిన పుండు నుంచి రక్తనాళాల ద్వారా ఆ చీము మెదడులోని రక్తనాళాలలోనికి ప్రవేశించి మెదడులోని కొన్ని ముఖ్య భాగాలలో అడ్డు పడటమో లేక ఆయా చోట్ల చీము ఏర్పడేలా చేయుటమో జరగడం వల్ల ఇలా ఏర్పడిందని నా అభిప్రాయం. ఒక వైపు కాలూ— చెయ్యి లాగటం అనేదిస్పృహ తప్పటం అనేవి పైన వ్రాసిన వాటిని పటిష్టం చేస్తున్నాయి. ఒక వైపున మాత్రం చేయి కాలు లాగటం వల్ల మెదడులోని అర్ధభాగం మాత్రం [కుడికాలు, చెయ్యి అయితే— మెదడు ఎడమవైపు అర్ధభాగం] రోగానికి గురి అయిందని తెలుస్తున్నది. మీరు మీ ఊరికి దగ్గరలో ఉన్న మంచి వసతులు గల ఆస్పత్రులలో న్యూరో ఫిజీషియన్‌లని కలుసుకుని సంప్రదించడం ఉత్తమం ఇకనైనా ఆలస్య చేయకుండా చికిత్స చేయించుకొంటే ఇక మీాద రానున్న అవాంతరాలను ఆపవచ్చు.

(49 వ పేజీ చూడండి)

# సారీ!

"ఇంతకీ నిన్ను చేసుకునే ఆ అదృష్టవంతుడు ఎవరూ?"

'మా మేనత్త కొడుకు జగన్నాధ్"

"ఆంధ్రా బ్యాంక్‌లో గ్రేడ్ ఒన్ ఆఫీసరని చెప్పావ్. అతనేనా?"

"అవును" అన్నది.

"వాళ్ళు మంచి ఆస్తిపరులు గదూ?"

తల వూపింది

సుబ్బరాజు కప్పును టేబిల్ మీద పెట్టాడు

నిమిషం తర్వాత "ఒక రకంగా నీకు మంచి జరిగింది" అన్నది మాలతి.

"ఏ విధంగా?"

"నీకు పెళ్ళి కావలసిన చెల్లెలు వుంది. మనిద్దరం పెళ్ళి చేసుకుంటే నీకు కట్నం రాదు ఇప్పుడు మరో అమ్మాయిని కట్నంతో పెళ్ళి చేసుకోవచ్చు ఆ కట్నంతో మీ చెల్లెలి పెళ్ళి చెయ్యవచ్చు" అన్నది.

మాట్లాడలేదు సుబ్బరాజు.

"బహూశ ఇక ముందు మనిద్దరం కలుసుకోమేమో. ఇదే చివరిసారి కావచ్చు" అన్నది మాలతి.

"అందుకే చివరిసారిగా నీకో నిజం చెబుదామనుకుంటున్నాను" అన్నాడు సుబ్బరాజు.

ఏమిటన్నట్టు ఆశ్చర్యంగా చూసింది మాలతి.

"సారీ...మాలతీ...నేను నిన్ను ప్రేమించలేదు. నటించాను. నీ మనసును నేను ఎప్పుడో చదివాను. నీకు నామీద ప్రేమ లేదని నాకు తెలుసు. ఓ మంచి రచయితగా ఈ మనుషుల్లో నాకు ఎటువంటి గౌరవముందో తెలుసుకొని సరదాగా నాతో పరిచయం పెంచుకున్నావు. ప్రేమ లేఖలు వ్రాశావు. నేను రాసిన ఉత్తరాలను నీ స్నేహితులకు చూపి ఓ రచయిత నాకు ప్రేమలేఖలు రాశాడని చెప్పి వారి మధ్య నీ స్థానాన్ని మరికొంత పెంచుకున్నావు నీ క్లాసుమేటు వసుంధర నాకు వరుసకు చెల్లెలవుతుందని - ఆ అమ్మాయిని ఎప్పటి కప్పుడు నీ స్నేహితులకు నువ్వు నా గురించి చెప్పేమాటలను నాకు చెబుతోందని నీకు తెలీదు. నీ పెళ్ళి జరిగే వరకూ నా జీవితంతో ఆడుకోవా లనుకున్నావు. నేను నిజంగా ప్రేమించివుంటే ఇప్పుడు ఎంత కుమిలి పోయేవాడిని? ఏమైనా నీకంటే బాగా నటించగలిగి నందుకు నన్ను నేనే అభినందించుకుంటున్నాను. అన్నట్టు మాలతీ.. నా పెళ్ళి సెటిలయ్యింది.. మరో వారం రోజుల్లో జరగబోతోంది. నువ్వు తప్పకుండా రావాలి.. డోన్ట్ మిస్.." అంటూ ప్యాంటు జేబులోనించి శుభ లేఖ తీసి మాలతి ముందుపుంచి సర్వరు ఇచ్చిన బిల్లు తీసికొని గబగబా బయటకు వెళ్ళి పోయేడు సుబ్బరాజు.

ఊహించని మలుపుకు మాలతికి మెదడంతా మొద్దు బారిపోయింది. అవమానంతో ఏడుపు వచ్చింది. సుబ్బరాజు అంతకుణ్ణంగా తనమనసును, ఆలోచనలను చదివి తనకంటే బాగా నటించినందుకు ఆమె హృదయం ఎవరో బలవంతాన కోసినట్టు గిలగిల్లాడి పోయింది.

కొంచెం సేపటి తర్వాత కర్చీఫ్‌తో కన్నీటిని తుడుచుకుని సుబ్బరాజు శుభలేఖను అక్కడే వదిలి నీరసంగా బయటకు నడిచింది మాలతి.